# మనిషి - మనసు

వీరభద్రరావ్ పమ్మి

నా మొదటి కథ వారపత్రికలో వచ్చినప్పుడు నా ఆనందానికి హద్దులేదు. హితులకి, స్నేహితులకి ఈ విషయం చెప్పి కథ చదివి వారి అభిప్రాయం చెప్పమని కోరాను. దూరంగా ఉన్న చుట్టాలకి, స్నేహితులకి ఉత్తరాలు రాశాను. మా ఆవిడైతే నా కథ వచ్చిన వారపత్రిక పట్టుకుని చుట్టుపక్కల ఇళ్ళన్నీ తిరిగింది.

మార్కెట్లో పత్రిక కొనగానే నారాయణగారి ఆఫీసుకెళ్ళి అది చూపించాను. "వెరీ గుడ్.... ఇహ పదండి ముందుకు" అని ఉత్సాహపరిచారాయన.

నారాయణగారు మా ఆఫీసుకి దగ్గర్లోనే ఉన్న మరో గవర్నమెంటు ఆఫీసులో పనిచేస్తారు. ఆయన చాలా కాలంనుంచి కథలు, నవలలు రాసి లబ్ధప్రతిష్ఠుడయ్యారు. తెలుగు పాఠకుల్లో ఆయనకి ఓ 'ఫాలోయింగ్' ఉంది. ఆ మధ్య నా కాయన ఓ స్నేహితుని ద్వారా పరిచయమయ్యారు. నేను మొట్ట మొదట కథ రాద్దామనుకున్నప్పుడు— ఆ విషయం ఆయనకి చెప్పాను. ఆయన నన్ను ఉత్సాహపరిచి భుజం తట్టారు. నేను కథ రాయగానే తీసికెళ్ళి ఆయనకి ఇచ్చాను. ఆయన అది చూసి ఇంటికి తీసికెళ్ళి కొన్ని మార్పులు చేర్పులు చేసిచ్చారు. అది ఏ పత్రికకు పంపాలో కూడా ఆయనే చెప్పారు. అది ప్రచురణకి స్వీకరించబడిందని పత్రికనుంచి తెలియగానే ఆ ఉత్సాహంతో మరో నాలుగు కథలు రాసి మరో నాలుగు పత్రికలకి పంపించాను. అంచేత నన్ను

రచయితగా దేశంమీదకి వదిలిన ఖ్యాతి నారాయణగారికే దక్కుతుంది.

మొదటి కథ తాలూకు పారితోషికం వచ్చింది. అందులో సగభాగం నారాయణ గారి కివ్వడం సమంజసం అనిపించింది. నాకు వచ్చింది ఏభై రూపాయలు. అందులో సగం పాతిక రూపాయలు. నారాయణగారి లాంటి పెద్ద రచయితకి పాతిక రూపాయలివ్వడమంటే ఆయన్ని అవమానించినట్టే అవుతుందనిపించింది.

మరేం చెయ్యాలి? అని ఆలోచించాను.

ఓ ఆదివారం ఆయన్ని మా ఇంటికి భోజనానికి పిల్చి, బహుమతిగా మంచి పెన్ కొనివ్వాలని నిర్ణయించుకున్నాను. ఈ ప్రతిపాదన మా ఆవిడకి కూడా నచ్చింది. నారాయణగార్ని భోజనానికి పిల్చిన రోజున ఏ హాటు, ఏ స్వీటు చెయ్యాలో నేను, మా ఆవిడ చర్చించుకుని నిర్ణయించాం. కోఠి, అబిడ్స్ తిరిగి డెబ్భైఅయిదు రూపాయలతో మంచి విదేశీ పెన్ కొన్నాను.

శుక్రవారం మధ్యాహ్నం నారాయణ గారి ఆఫీసు కెళ్ళాను. ఆదివారం మా ఇంటికి భోజనానికి ఆహ్వానించాలని నా ఉద్దేశ్యం. మామూలు పలకరింపులు అయ్యాక "ఇంతకీ మీ కథ తాలూకు డబ్బు వచ్చిందా?" అనడిగాడు ఆయన.

"ఆ వచ్చింది– ఆ విషయమే చెబ్దామని వచ్చాను" అన్నాను.

"మరేదీ నా సగం వాటా–?"

ఆయనలా అడిగేటప్పటికి నా మతి పోయింది. నోట మాట రాలేదు. ఆయన ఎంతలా బైటపడిపోయాడో అనిపించింది. జేబులోంచి పాతిక రూపాయలు తీసి ఆయన చేతిలో పెట్టి గబగబా వెనక్కి తిరిగి వచ్చేసాను....